
భరోసా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సీపీ గౌస్‌ఆలం

## భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన సీపీ

కరీంనగర్, మే 21 (నమస్తే తెలంగాణ): కొత్తపల్లిలోని భరోసా కేంద్రాన్ని బుధవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో గత డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ కేంద్రం పనితీరును, బాధితులకు అందిస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కేంద్రంలోని సిబ్బందితో మాటాడి, రికార్డులను పరిశీలించారు. బాధితులకు భరోసా కేంద్రంలో అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసుల వివరాలను పరిశీలించిన ఆయన నిందితులకు శిక్షలుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, లైంగిక వేధింపులకు గురైన మహిళలు, అసభ్యకరమైన లైంగిక ప్రవర్తనకు లోనైన పిల్లలకు పోలీస్‌స్టేషన్లు, దవాఖానలకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత నందించేందుకే రాష్ట్ర పోలీస్‌శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో అన్ని కమిషనరేట్ జిల్లాల్లో ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు సేవలందించడంలో భరోసా కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నట్లు చెప్పారు. లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందని వివరించారు. ఇక్కడ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ అనూష ఉన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- అక్కడికక్కడే యువకుడి మృతి

హుజూరాబాద్ టౌన్, మే 21: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం టిప్పర్‌ను స్కూటీని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి శ్రావణ్ కుమార్ (33) తన స్కూటీపై కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో జమ్మికుంట రోడ్డు వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రావణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో చౌరస్తాలో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

## నిరుద్యోగ పూర్వ విద్యార్థులకు శిక్షణ

తిమ్మాపూర్, మే 21: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో (సీవోఈ) విద్యనభ్యసించిన నిరుద్యోగ పూర్వ విద్యార్థులకు పలు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పూర్వ విద్యార్థికి ఉపాధి కల్పించాలన్నదే తమ సంకల్పమని తెలిపారు. 19 నుంచి 25ఏండ్ల గురుకుల పూర్వ విద్యార్థులు అల్గునూరు సీవోఈ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్ టౌన్, మే 21: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, డిపో క్రాస్ రోడ్, కరీంనగర్ రోడ్డులోని సైదాపూర్ రోడ్డు చౌరస్తా, జమ్మికుంట రోడ్డు ప్రభుత్వ దవాఖాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని 30వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసరి మధుకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కూడళ్ల వద్ద ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు అధిక రద్దీ ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణ లేక తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి శ్రవణ్‌కుమార్ మృతి చెందాడన్నారు. అలాగే కొన్ని నెలల క్రితం సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద రమేశ్ అనే ల్యాబ్ టెక్నీషియన్, తెల్లవారుజామున విధులు నిర్వర్తిస్తూ మున్సిపల్ కార్మికురాలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటుతో ట్రాఫిక్ నియంత్రించవచ్చన్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేసి, ప్రమాదాలను నియంత్రించాలని కోరారు.

## స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

మానకొండూర్, మే 21: మండల కేంద్రంలోని తూర్పుదర్వాజ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి 11 గంటలకు ఓ ఇసుక లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లు తెగిపడితే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు వాపోయారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి, మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

# నీరుగారుతున్న 'అంగన్‌వాడీ' లక్ష్యం?

- లబ్ధిదారులకు దూరంకానున్న పోషకాహారం!
- కేంద్రాల తరలింపునకు అధికార యంత్రాంగం చర్యలు
- అందుబాటులో లేని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు
- ఆందోళనలో లబ్ధిదారులు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కలెక్టరేట్, మే 21: నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామంటూ ప్రకటనలు చేస్తూనే.. అందరికీ అందుబాటులో ఉన్న కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం పేరిట ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు విడుదల చేస్తున్నామంటూనే.. కేంద్రాల సేవలను మరింత దూరం చేస్తుండడంతో అంగన్‌వాడీ సెంటర్ల లక్ష్యం నీరుగారుతోందా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అద్దె భారంతో ప్రభుత్వ భవనాల్లోకి..?

దశాబ్దాల నుంచి ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా దూరం చేసేందుకే తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక నుంచి వీటి సేవలు అందుకోవడం కష్ట సాధ్యమేననే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంటున్నది. పౌష్టికాహార పంపిణీతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తూ, పలు ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా మారిన అంగన్‌వాడీ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. అయితే, అద్దెభారంతో ప్రస్తుతం వీటిని ప్రభుత్వ భవనాల్లోకి మార్చుతున్నారు. చాలాచోట్ల ప్రభుత్వ భవనాలు లేక వీటిని ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చుతున్నారు. అత్యధిక శాతం పాఠశాలలు ఊరి పొలిమేరల్లో ఉండగా, కేంద్రాలు వాటిలోకి మారుతుంటే అంగన్‌వాడీ సేవలు అందుకోవడంపై లబ్ధిదారులు నిరాసక్తత ప్రదర్శించే అవకాశాలుంటాయని అంగన్‌వాడీ సిబ్బందే పేర్కొంటున్నారు. ఎక్కువ మంది లబ్ధిదారులు ఉండే ప్రాంతాల్లో మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉండగా, ఇందుకు భిన్నంగా వీటిని తరలిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### ప్రైవేట్ భవనాల్లో 265 సెంటర్లు

జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వాటి పరిధిలో 777అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 265 ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతుండగా, వీటన్నింటినీ ప్రభుత్వ భవనాల్లోకి మార్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిలాలో 21సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోకి మార్చింది. కరీంనగర్ అర్బన్ పరిధిలో 113 కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తుండగా, ఆరింటిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోకి, కరీంనగర్ రూరల్ ప్రాజెక్టు పరిధిలో 34 కేంద్రాలకు 5, గంగాధర ప్రాజెక్టు పరిధిలో 43 కేంద్రాలకు గానూ 6, హుజూరాబాద్ పరిధిలో 75సెంటర్లకు 5 కేంద్రాలను తరలించారు. కొత్త విద్యాసంవత్సరం మొదలయ్యే నాటికి దాదాపుగా ఈ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు కసరత్తు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలకు సమీపంలో ప్రభుత్వ భవనాలు లభించటం గగనకుసుమం కాగా, మిగతా వాటిని ప్రభుత్వ పాఠశాలల్లోకి తరలించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఆందోళనలో లబ్ధిదారులు

ఎక్కువచోట్ల ప్రభుత్వ పాఠశాలలు గ్రామ శివారుల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలున్న చోటు నుంచి సుమారు కిలోమీటర్‌కు పైగా దూరం ఉండగా, లబ్ధిదారులు అంతదూరం వెళ్లి తమకు అందించే పౌష్టికాహారం తీసుకోవడం అసాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారులు ఫొటోలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే తప్ప, వారికి పోషకాహారం అందదు. గర్భిణులు, బాలింతలు తాము నివసించే ప్రాంతాల నుంచి దూరంగా మార్చిన కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోవడం కష్టసాధ్యమైన పని. అన్ని వేళల్లో పరిస్థితులు అనుకూలించక కేంద్రాలకు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో పౌష్టికాహారం అందక వారు ఇబ్బందుది పడడం అనివార్యమనే వాదన వస్తోంది. పాలకులు చేస్తున్న వృథా ఖర్చులతో పోల్చితే అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లింపు పెద్ద భారమేమి కాదని.. వెంటనే కేంద్రాల తరలింపు ప్రక్రియను నిలిపివేసి, యథావిధిగా కొనసాగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలకు తరలిరావాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూడబ్ల్యూజే 143 నాయకులు, సభ్యులు

కలెక్టరేట్, మే 21: తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబురాలకు జిల్లా నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–143 జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని రహదారులు, భవనాలశాఖ అతిథి గృహంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా శాఖ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ గొంతుకైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ వేడుకలు ఈ నెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరుగనుండగా, జిల్లా నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య వెంటనే పరిష్కరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. జిల్లా యూనియన్ సభ్యులకు దవాఖానల్లో ఫీజు తగ్గింపు, మినహాయింపు కోసం యూనియన్ పక్షాన ప్రత్యేక చొరవ తీసుకునేందుకు తీర్మానిస్తున్నట్లు ప్రకటించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అడ్‌హక్ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ, కోకన్వీనర్లుగా సిరిసిల్ల హృషికేశ్, వేల్పుగొండ రవీందర్‌ను నియమించారు. అనంతరం రజతోత్సవ వేడుకల గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కే ప్రకాశ్‌రావు, జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి బోనాల తిరుమల్, సీనియర్ జర్నలిస్టు వెంకట్, పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- యాంటీ టెర్రరిజం డే ర్యాలీ ప్రారంభం

కొత్తపల్లి, మే 21: ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్థాన్ భూ భాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బందిలేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. ఉగ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సామాన్య ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సైన్యానికి మద్దతుగా నిలవడం దేశ భక్తికి నిదర్శనమన్నారు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం వాళ్లు ముందుకొచ్చి ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్

# సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్ల రద్దుపై తలోమాట

- ఇప్పటికే ఉత్తర్వులు విడుదలైనట్లు రెవెన్యూ యంత్రాంగం
- ప్రత్యేకాధికారి నియామకం అనంతరమే రద్దు చేస్తారంటూ రిజిస్ట్రేషన్ అధికారులు
- సమన్వయ లేమితో గందరగోళం

కలెక్టరేట్, మే 21: జిల్లా కేంద్రానికి సమీపంలోని కొత్తపల్లి మండల పరిధిలో గల సీలింగ్ యాక్టు కింద ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల రద్దు వ్యవహారంపై అధికార యంత్రాంగం తలోమాట మాట్లాడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ రిజిస్ట్రేషన్లను వారం క్రితమే రద్దు చేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటుండగా, ప్రత్యేకాధికారిని నియమించిన అనంతరమే రద్దు చేస్తారంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. తాము ఇప్పటికే ఆందోళన చెందుతుండగా, అధికారుల ప్రకటనలతో మరింత టెన్షన్‌కు గురవుతున్నట్లు కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. భూక్రయ విక్రయాల్లో క్రియాశీలకమైన రెవెన్యూ, స్టాంపుల రిజిస్ట్రేషన్ల శాఖల మధ్య కొరవడుతున్న సమన్వయలేమితోనే సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, వీటిపై సరైన విధంగా స్పందించడంలో ఈ రెండు శాఖల అధికారుల మధ్య ఇంకా సమన్వయం కుదరడం లేదనే చర్చ కొనసాగుతున్నది. నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై ఆచితూచి ఉండాల్సిన యంత్రాంగం స్పందిస్తున్న తీరు ఆశాఖల్లోనే చర్చనీయాంశంగా మారుతుండడం ఆయా శాఖల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని మాత్రమే కలెక్టర్ నుంచి తమకు ఆదేశాలందాయని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల రద్దుకు పాటించాల్సిన విధివిధానాలు వివరించడంతో ప్రత్యేకాధికారిని నియమించి సదరు అధికారి ద్వారా రద్దు ఉత్తర్వులు వెలువరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల్లో ఒకరిని ఎంపిక చేసి, ప్రత్యేక బాధ్యతలు అప్పగించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయం వరకు ఈప్రక్రియ పూర్తి కాగానే ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు, వాటిని రద్దు చేసే విధానంపై చర్చించిన అనంతరమే సదరు అధికారి రద్దు ఉత్తర్వులు వెలువరిస్తారని వెల్లడిస్తున్నారు. ముందుగా ఎవరిపేరుపై రిజిస్ట్రేషన్ అయింది, తర్వాత ఎంతమందికి మారిందనే వివరాలు సేకరించిన రిజిస్ట్రేషన్ అధికారులు వాటిని ఇప్పటికే కలెక్టర్‌కు అందజేసినట్లు వెల్లడిస్తుండగా, ఈ వివరాల ఆధారంగానే ప్రత్యేకంగా నియామకమయ్యే అధికారి రద్దు ఉత్తర్వులు సిద్ధం చేసే అవకాశాలున్నట్లు సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు రోజుల్లో ఈ తతంగానికి ముగింపు పలికి, తర్వాత సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ జరుపనున్నట్లు తెలుస్తోంది. ఏ అధికారి ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశాడు. ఏ నెలలో ఎన్ని చేశాడనే వివరాలు కూడా సేకరించిన యంత్రాంగం ఆ ఆధారాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులను విచారించి, అనంతరం చర్యలకు సిఫారసు చేస్తారనే చర్చ ఆశాఖలో కొనసాగుతున్నది.

### హైకోర్టుకు కొత్తపల్లి భూ భాదితులు ?

గంగాధర, మే 21: మండలంలోని కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లలో (175,197,198) భూముల రిజిస్ట్రేషన్లపై నాలుగు రోజులు క్రితం జిల్లా కలెక్టరేట్ నుంచి నోటీసులు అందడంతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం మొదలైంది. సర్వే నంబర్లు 175,197,198లో జరిగిన 476 డాక్యుమెంట్లు రద్దు చేస్తున్నట్లు వార్తలు రావడం, సబ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సదరు డాక్యుమెంట్లపై దృష్టిసారించడంతో సదరు సర్వే నంబర్లలో భూములు కొనుగోలు చేసినవారు ఆందోళనకు గురతున్నట్లు తెలిసింది. దీంతో కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 175,197,198లో భూములు కొనుగోలు చేసిన దాదాపు 50 మంది వరకు హైకోర్టును ఆశ్రయించడానికి సిద్ధమైనట్లు తెలిసింది. బుధవారం దాదాపు 20 మంది వరకు హైదరాబాద్ వెళ్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి అవసరమై పత్రాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

తిమ్మాపూర్ రూరల్, మే 21: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం మొగిలిపాలెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అవసరం మేరకు రసాయనాలను ఉపయోగించాలన్నారు. పంట మార్పిడి చేస్తూ అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జీ భాగ్యలక్ష్మి, కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పీ మధుకర్, డాక్టర్ డీ శ్రావణి, మానకొండూర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీధర్, ఏవో సురేందర్, ఏఈవో ప్రవీణ్ పాల్గొన్నారు.

## మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

కలెక్టరేట్, మే 21: కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొనేందుకు కృషి చేయాలని తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం జిల్లా అధ్యక్షుడు పరకాల రాజు బుధవారం నగరంలోని గీతాభవన్ సమీపంలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ, మావోయిస్టులు కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు, శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటన చేస్తుండగా, కేంద్రం మాత్రం ఆపరేషన్ కగార్ పేరుతో ఉద్యమకారులను చంపడం సమంజసం కాదన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇక్కడ ఫోరం ప్రతినిధులు రాజ్‌కుమార్, వెంకటేశం, నక్క మల్లేశం, మైలారపు శ్రీనివాస్, రాజేశం ఉన్నారు.

## రోడ్డుపై కూలిన ధాన్యం లోడ్

కరీంనగర్ రూరల్, మే 21: వరి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ కరీంనగర్– చొప్పదండి మార్గంలో కరీంనగర్ మండలం నగునూర్‌కు చేరుకోగానే కొన్ని బస్తాలు కుప్పకులాయి. లారీ డ్రైవర్ గమనించకపోవడంతో బస్తాలు కిందపడి ధాన్యమంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడింది. ప్లాస్టిక్ బస్తాలు కావడం, నెట్ సరిగా వేయకపోవడంతోపాటు రోడు గుంతలు పడి ఉండడంతో దాదాపు 10 బస్తాలు కిందపడ్డాయని లారీ డ్రైవర్ తెలిపాడు. స్థానిక హమాలీల సాయంతో మిగతా బస్తాలు నెట్ వేసుకుని ధాన్యాన్ని హైదరాబాద్‌కు తరలించారు.


నగునూర్ వద్ద లోడ్‌తో వెళ్తున్న లారీలోని బస్తాల నుంచి పడిన ధాన్యం

## చెత్త తొలగింపు

- 'నమస్తే' కథనానికి స్పందన

గంగాధర, మే 21: మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బంది నెలల తరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వచ్చి గ్రామస్తులు ఇబ్బందిపడ్డారు. పారిశుధ్యంపై పట్టింపేది శీర్షిక పేరిట రెండు రోజుల క్రితం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే రెండు రోజులపాటు గ్రామంలోని వీధుల్లో పేరుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

## అన్ని పుస్తకాలు రాలేదు

గంగాధర, మే 21: రానున్న విద్యా సంవత్సరంలో సర్కారు బడిలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం పంపించిన 17,610 ఉచిత పాఠ్య పుస్తకాలను ఎంఈవో ప్రభాకర్‌రావు బుధవారం ఉపాధ్యాయులకు అందజేశారు. మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్, 12యూపీఎస్, 20 పీఎస్, 3గురుకులాలు, మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. కాగా, పుస్తకాల్లో ఇంగ్లిష్ మీడియం 3వ, 4వ తరగతి గణితం, పరిసరాల విజ్ఞానం, 6వ తరగతి సైన్స్, 9వ తరగతి పర్యావరణం, 10వ తరగతి సోషల్, పర్యావరణం, తెలుగు మీడియం 3వ తరగతి ఇంగ్లిష్, 4వ తరగతి తెలుగు, 7వ తరగతి హిందీ, 8వ తరగతి బయాలోజీ, 9వ తరగతి హిందీ, 10వ తరగతి తెలుగు పుస్తకాలు రాలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పుస్తకాలను పంపించాలని విద్యార్థులతల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, మే 21: కరీంనగర్ చైతనా సైకాలజికల్ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి ఉచిత సైకాలజీ ఆన్‌లైన్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు బీపీఎల్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, యువకులకు వృత్తిపరమైన నైపుణ్యాలు సాధించడానికి సహాయపడుతుందన్నారు. సర్టిఫికేట్ కోర్స్ ఆఫ్ ప్రాక్టీస్ ఇన్ కౌన్సెలింగ్ సైకాలజీ, చైల్డ్ సైకాలజీ, కెరియర్ కౌన్సెలింగ్ కోర్సులు ప్రవేశం పొందడానికి గ్రాడ్యుయేషన్ లేదా పీజీ సైకాలజీ ఉన్నవారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ నంబర్ (97039 35321)కు సంప్రదించాలన్నారు. లేదా atlasrinivasreddy.dietexpert@gmail.comలో సంప్రదించాలన్నారు.

## ఇంట్లో చెత్తను వేరు చేసి ఇవ్వాలి

కార్పొరేషన్, మే 21: ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను మూడు పద్ధతుల్లో వేరు చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. బుధవారం 12 వ డివిజన్ భగత్ నగర్‌లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అపార్టుమెంట్లలో ఉత్పత్తి అవుతున్న చెత్తను వందశాతం సెగ్రిగేషన్ చేయాలన్నారు. మూడు డబ్బాలలో తడి చెత్తను, పొడి చెత్తను, ఇతర చెత్తను ఇలా మూడు రకాలుగా వేరుచేయాలని పిలుపునిచ్చారు. తడి చెత్తను మీ అపార్ట్‌మెంట్ ఆవరణలోనే హోం కంపోస్ట్ చేయాలన్నారు. పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు తదితర వస్తువులను పారిశుధ్య కార్మికులకు అందిస్తే డీఆర్ సీసీ సెంటర్లకు రీసైక్లింగ్ కోసం తరలిస్తారని తెలిపారు. చెత్తను వేరు చేయడం ద్వారా డంప్‌యార్డుకు వెళ్లే చెత్త శాతం తగ్గుతుందన్నారు. హోం కంపోస్ట్ ఎరువులను ఇంట్లో మొక్కలకు వాడుకోవాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి, అపార్ట్‌మెంట్ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జితో సీపీ భేటి

కరీంనగర్, మే 21 (నమస్తే తెలంగాణ): జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్ శివకుమార్‌ను బుధవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 14న జరగనున్న లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న రాజీపడే కేసులను కోర్టుల వారీగా పరిష్కరించాలని జడ్జిని సీపీ కోరారు. లోక్‌అదాలత్ సన్నద్ధతలో భాగంగా కోర్టు ఆవరణలోని మీటింగ్ హాల్‌లో సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెక్రటరీ వెంకటేశ్ ఆధ్వర్యంలో కమిషనరేట్‌లోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్లవారీగా పెండింగ్‌లో ఉండి, రాజీపడిన కేసుల వివరాలను చర్చించారు. కార్యక్ర మంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డీ ప్రీతి, స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ బీ రాజేశ్వర్, ఏసీపీ వెంకట్‌స్వామి, ఇన్ స్పెక్ట ర్లు బిల్లా కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, ఖరీముల్లాఖాన్, సంతోష్‌కుమార్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ

తిమ్మాపూర్, మే 21: ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయులకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్ర పరిశీలకుడు కృష్ణారావు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. సాంకేతికత, నూతన విధానాలను అవలంబించి సులభంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఇక్కడ ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు.

## ఈదులగట్టెపల్లి శివారులో గుర్తు తెలియని శవం

మానకొండూర్ రూరల్, మే 21: ఈదుల గట్టెపల్లి శివారులోని కాకతీయ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారం మేరకు మానకొండూర్ సీఐ సంజీవ్, పోలీసులు బుధవారం ఘటనా స్థలానికి వెళ్లారు. చనిపోయిన వ్యక్తి దాదాపు 30–35 ఏండ్లు ఉంటాయని, బిహార్ లేదా ఇతర ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. దాదాపు 3–4రోజుల క్రితమే మృతిచెం దినట్లు తెలిపారు. గ్రామ కారోబార్ ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

గన్నేరువరం, మే 21: చీమలకుంటపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌వో నర్సింగారావు బుధవారం పరిశీలించారు. కేంద్రంలో నిల్వ చేసిన బస్తాలను పరిశీలించారు. వర్షాలు నేపథ్యంలో కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు.

## ప్రభుత్వ భూమిలో సర్వే

హుజూరాబాద్ టౌన్, మే 21: పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద గల 1869, 1874 సర్వే నంబర్ గల భూమిని బుధవారం జిల్లా అధికారులు సర్వే నిర్వహించారు. భూమి ఆక్రమణకు గురైందని పలువురి ఆరోపణల నేపథ్యంలో భూమిని పరిశీలించి హద్దులు నిర్ణయించారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు వివరిస్తామని తెలిపారు. ఇక్కడ జిల్లా సర్వే ఏడీ ప్రభాకర్, హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ కే కనకయ్య, హెడ్ క్వార్టర్ డీఐ రవీంద్రాచారి, డీఐ ఫయాక్‌అలీ, సర్వేయర్లు సత్యనారాయణ, వంశీకృష్ణ, ఆర్ఐలు శేఖర్, రంజిత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## వీఎన్ఆర్ ఫౌండేషన్ ఔదార్యం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి, భక్తులు

కమాన్‌చౌరస్తా, మే 21: హనుమాన్ స్వాముల సౌకర్యార్థం కొండగట్టు దారిలో వీఎన్ఆర్ ఫౌండేషన్ అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చల్లని నీరు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొత్తపల్లిలో ప్రారంభించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవ చేయడంతో తృప్తి లభిస్తుందన్నారు. కొత్తపల్లిలో హనుమాన్ దీక్షాపరులు, భక్తుల సౌకర్యార్థం ఈ శిబిరాన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

కరీంనగర్ రూరల్, మే 21: కరీంనగర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలను ఎంఈవో కే రవీందర్ పంపిణీ చేశారు. బుధవారం దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంబంధించిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఇక్కడ ఎంఆర్‌సీ సిబ్బంది గాలిపెల్లి రవిచందర్, వీ రమేశ్, అర్చన, తదితరులు ఉన్నారు.

## సీఐని కలిసిన సభ్యులు

జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), మే 21: జమ్మికుంట పట్టణ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను కరీంనగర్ జిల్లా సగర సంఘం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర, నాయకులు కుర్మిండ్ల అశోక్ కుమార్, బొడిపెల్లి సదానందం ఉన్నారు.

## దంచికొట్టిన వర్షం

గంగాధర, మే 21: మండలంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. ఈదురుగాలులకు మండల కేంద్రానికి వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డుగా చెట్టు కూలింది. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్ స్థానికుల సాయంతో చెట్టును తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189